సాక్షి ఆదిలాబాద్

I

శుక్రవారం ౹ 11 ౹ అక్టోబర్ ౹ 2024



బతుకమ్మలతో మహిళలు

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..



కైలాసనగర్/ఆదిలాబాద్: బతుకమ్మ సంబురాలు మహిళలు ఘనంగా జరుపుకుంటున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ..బతుకమ్మ.. ఉయ్యాలో.., ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ ఆడిపాడుతున్నారు. కోలాటాలు, దాండియా, నృత్యం చేస్తూ ఆకట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ హాజరయ్యారు. కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, వెంకటేష్, మహిళ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

న్యూస్‌రీల్

డిగ్రీ లెక్చరర్‌కు ఆర్మీ లెఫ్టినెంట్ హోదా



లక్ష్మణ్‌ను అవార్డుతో సత్కరిస్తున్న అకాడమీ మేజర్ జనరల్ కపిల్‌జిత్ సింగ్

ఆదిలాబాద్‌రూరల్: బోథ్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర లెక్చరర్‌గా పనిచేస్తున్న పుట్ట లక్ష్మణ్ ఎన్‌సీసీ విభాగంలో ఆర్మీ లెఫ్టినెంట్ హోదా పొందారు. జూలై 29 నుంచి అక్టోబర్ 9 వరకు ఎన్‌సీసీ ప్రీ కమీషన్డ్ నిర్వహించిన ఆర్మీ శిక్షణలో పాల్గొన్నారు. డ్రిల్ పరేడ్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, నాయకత్వం, కమాండర్‌షిప్, రైట్స్ డ్యూటీస్, క్రమశిక్షణ, ఐక్యత, ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ పొందారు. గురువారం జరిగిన పాసింగ్‌అవుట్ పరేడ్‌లో ఆర్మీ అధికారి, ఎన్‌సీసీ ఆఫీసర్ ట్రెనింగ్ అకాడమీ మేజర్ జనరల్ కపిల్‌జిత్ సింగ్ రాథోడ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లకు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

తండాల్లోని సమస్యలు పరిష్కరించాలి



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: సదుపాయాలు, మౌలిక వసతులు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, అటవీ భూములకు, అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని లంబాడీ జేఏసీ నాయకులు గురువారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం శాలువాతో సన్మానించారు. లంబాడీల సంస్కృతి సంప్రదాయాలపై వివరించారు. కలిసిన వారిలో సమాజ పెద్దలు గోపాల్‌రావు, జేఏసీ కార్యదర్శి జగన్, లంబాడీ హక్కుల పోరాటసమితి రాష్ట్ర నాయకులు భరత్ చౌహాన్, ఎడ్మా నాయక్, గణేశ్ రాథోడ్, దేవిదాస్, గంగారాం, రాందాస్ తదితరులు పాల్గొన్నా రు.

డీఈవో కార్యాలయంలో కొత్త టీచర్ల రిపోర్టు



రిపోర్టు చేస్తున్న టీచర్లు

ఆదిలాబాద్‌టౌన్: 2024 డీఎస్సీ ద్వారా అర్హత సాధించి నియామకపత్రాలు పొందిన నూతన ఉపాధ్యాయులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మొత్తం 266మందికి గాను 233మంది టీచర్లు రిపోర్టు చేశారు. మరో 33 మంది రిపోర్టు చేయాల్సి ఉంది. వీరిలో ఎల్‌పీ తెలుగులో 9, ఎల్‌పీ హిందీలో 1, ఎల్‌పీ మరాఠీలో 2, ఎస్జీటీ తెలుగు మీడియంలో 128, ఎస్జీటీ హిందీలో 5, ఎస్జీటీ ఉర్దూలో 4, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యూకేషన్‌లో 14, ఎస్ఏ తెలుగులో 4, ఎస్ఏ హిందీలో 2, ఎస్ఏ ఇంగ్లీష్‌లో 7, ఎస్ఏ గణితంలో 4, ఎస్ఏ బయోసైన్స్‌లో 12, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యూకేషన్‌లో ఒకరు, దీంతో పాటు ఉర్దూ మీడియంలో పలువురు అభ్యర్థులు రిపోర్టు చేశారు. మిగితా ఉపాధ్యాయులు శుక్రవారం డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత పేర్కొన్నారు.

కొలిక్కి వచ్చేనా..!

- వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలపై ఆశావహుల ఎదురుచూపు
- జిల్లాలోని మూడు ఏఎంసీల్లో పెండింగ్
- సమీపిస్తున్న పంటల కొనుగోళ్లు



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకంలో తాత్సారం కొనసాగుతుంది. జిల్లాలో ఐదు ఏఎంసీలు ఉండగా, మూడు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ నామినేటెడ్ పోస్టు కోసం ఆ పార్టీ ఆశవాహుల్లో ఎదురుచూపు నెలకొంది. నెలలుగా ఆలస్యం జరుగుతుండడంతో ఇది ఎప్పటివరకు కొలిక్కి వస్తుందా అని పార్టీలో చర్చ సాగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఈ పదవులను నియమిస్తుండగా, రాష్ట్రంలో తొలి పాలకవర్గంగా జిల్లాలోని బోథ్ మార్కెట్ కమిటీకి నియమించడం గమనార్హం. దీంతో అప్పట్లోనే మిగితా ఏఎంసీలకు కూడా పాలకవర్గాలను నియమిస్తారని అనుకున్నప్పటికీ జాప్యం జరుగుతూనే ఉంది.

జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లిలలో ఉండగా, జైనథ్, బోథ్‌లలో కాంగ్రెస్ పార్టీ పాలకవర్గాలను నియమించింది. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లిలో మాత్రం నియామకంలో ఆలస్యం జరుగుతోంది. ప్రధానంగా ప్రస్తుతం వానకాలం పంటల కొనుగోళ్ల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో ఏవైనా ఒడిదుడుకులు ఎదురైతే సమస్యల పరిష్కారానికి పాలకవర్గం ముందుండాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రధానంగా ఆదిలాబాద్ మార్కెట్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయంటే, ధర పడిపోయినప్పుడు రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ పరిస్థితుల్లో పాలకవర్గం పాత్ర కీలకం. ప్రధానంగా రైతులు, వ్యాపారులు, అధికారులను సమన్వయపరిచి, సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత పాలకవర్గాలపై ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రధానంగా ఆదిలాబాద్ మార్కెట్‌కు ఏఎంసీ చైర్మన్ నియామకంలో ఎందుకు తాత్సారం జరుగుతుందా అన్న ప్రశ్న తలెత్తుతుంది.

ఎవరికి దక్కేనో..

బోథ్ ఏఎంసీ చైర్మన్‌గా బొడ్డు గంగారెడ్డి, జైనథ్ ఏఎంసీ చైర్మన్‌గా అశోక్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్‌కు సంబంధించి కాంగ్రెస్ నాయకుడు కోరెడ్డి కిషన్ పేరు ప్రధానంగా చర్చలో ఉంది. ఆ మధ్యలో ఈ పాలకవర్గం నియామకం దాదాపుగా కొలిక్కి వచ్చిందని పార్టీలో చర్చ సాగినప్పటికీ, ఆ తర్వాత అలాగే నిలిచిపోయింది. ఇచ్చోడకు సంబంధించి ఆ పార్టీ సీనియర్ నేత కుమ్రం కోటేష్ సతీమణికి పదవి కేటాయిస్తున్నారని ప్రచారం జరిగినప్పటికీ అక్కడ కూడా కొలిక్కి రాలేదు. ఇక ఇంద్రవెల్లిలో నాయకులు మేస్రం నాగనాథ్, ముకాడే ఉత్తమ్‌ల పేర్లు వినబడుతున్నాయి. ప్రస్తుతం పంటల కొనుగోళ్లు సమీపిస్తుండగా ప్రభుత్వం పాలకవర్గాల నియామకంపై దృష్టి సారించే అవకాశం ఉంది. రాష్ట్రంలో అనేక మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమించినటువంటి ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్నవాటిపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

మూడు పాలకవర్గాలను నియమించాల్సి ఉంది..



జిల్లాలో ఆదిలాబాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. దీని పదవి కాలం రెండేళ్లు ఉంటుంది. మరో సంవత్సరం పొడగింపునకు కూడా అవకాశం ఉంటుంది. ఆదిలాబాద్ జనరల్ రిజర్వేషన్ ఉండగా, ఇచ్చోడ, ఇంద్రవెల్లి ఎస్టీ రిజర్వుడ్ ఉన్నాయి.

– గజానంద్, ఆదిలాబాద్ డీఎంవో

కేంద్ర బృందం పర్యటన



లోకారి-కేలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

నార్నూర్(గాదిగూడ): గాదిగూడ మండల కేంద్రంలోని లోకారి-కే, ఆర్మీయాన్ గ్రామాల్లో గురువారం ఎన్ఆర్ఎల్ఎం బృందం సభ్యులు రఘునాథ్, నటరాజన్ పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల అమలుపై ఆరా తీశారు. పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ పనులను బృందం సభ్యులు పరిశీలించారు. పథకాలను ప్రజలకందేలా అధికారులు పని చేయాలన్నారు. అదనపు డీఆర్డీవో కుటుంబరావు, అడిషనల్ పీడీ కృష్ణారావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో నితిన్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- కేసుల సత్వర పరిష్కారం దిశగా విధులు నిర్వర్తించాలి
- ఎస్పీ గౌస్ ఆలం



డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

గుడిహత్నూర్: రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్ ఆయన తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి, పరేడ్‌ను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు ఎదురైనప్పుడు సిబ్బంది వాటిని ఎదుర్కొనేలా తీసుకోవాల్సిన డ్రిల్‌ను తిలకించారు. సిబ్బంది యొక్క విధులు, రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పచ్చదనం కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలకు గురైన వాహనాలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతుల వివరాలు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తూ దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ భీమేష్, ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయాలి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: అక్రమ లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం తహసీల్దార్లు, పంచాయతీ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై గ్రామపంచాయతీల వారీ గా ఇంటింటికీ తిరుగుతూ పరిశీలన చేపట్టాలని సూచించారు. జిల్లాలో 8,994 దరఖాస్తులకు గా ను, 1001దరఖాస్తులను పరిశీలించి 757ఆమోదించినట్లు తెలిపారు. మిగితా దరఖాస్తులను రో జుకు 20చొప్పున పరిశీలించి నిర్దిష్ట గడువులో పూ ర్తయ్యేలా శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను సైతం త్వరితగతిన పరి ష్కరించేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల డాటాఎంట్రీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఏవైన పొరపాట్లు జరిగితే బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, డీటీ సీపీవో సుమలత, డీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి

కై లాస్‌నగర్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించిన కుటుంబ సభ్యుల డాటాఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న డాటాఎంట్రీ తీరును పరిశీలించారు. దానికి సంబంధించి కమిషనర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాటాఎంట్రీలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యుల ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, శుక్రవారంలోగా ప్రక్రియను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఈడీఎం రవి తదితరులు ఉన్నారు.

పండుగ పూట..రైతులకు ఊరట

- ఖాతాలో పంట నష్ట పరిహారం జమ
- ఎకరాకు రూ.10వేల చొప్పున విడుదల చేసిన ప్రభుత్వం
- గత నెలలో కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలు



నీటమునిగిన పత్తి పంట (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్/పెంచికల్‌పేట్: గతనెల మొదటి వారంలో భారీ వర్షాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంటలు నీట మునిగాయి. వరదలకు పొలాలు, చేలల్లో ఇసుక మేటలు వేసింది. రోజుల తరబడి చేలల్లో నీరు నిల్వ ఉండడంతో పంటలు కుళ్లిపోయాయి. ఈ క్రమంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు సర్వే చేసి నష్టపోయిన పంటల వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. వ్యవసాయాధికారులు సర్వే చేసి కలెక్టర్ ద్వారా నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం డబ్బులను ప్రభుత్వం బతుకమ్మ పండుగవేళ రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సెప్టెబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కురిసిన వర్షాలకు పత్తి, సోయా, వరి, కంది పంటలు దెబ్బతిన్నాయి. సర్వే చేసిన అధికారులు సెప్టెంబర్ 10న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతానికిపైగా నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ పరిగణలోకి తీసుకుని సర్వేలో గుర్తించారు. ఇందులో అధికంగా పత్తి, వరి పంటలకు నష్టం జరిగినట్లు తేల్చారు. ఆదిలాబాద్ జిల్లాలో పెనుగంగ పరీవాహక ప్రాంతాలతో పాటు తలమడుగు, బోథ్, గాదిగూడ, ఉట్నూర్, తాంసీ తదితర 8 మండలాల్లో పత్తి, సోయాబిన్, కంది, మొక్కజొన్న, వరి 3,096.03 ఎకరాల్లో నష్టం జరిగింది. ఈ మేరకు 2,041 మంది బాధిత రైతులకు రూ.3,09,60,750 పరిహారం విడుదల చేసింది. మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, జైపూర్, జన్నారం, మంచిర్యాల, హాజీపూర్ మండలాల్లో పత్తి, వరి, కంది పంటలు 598.02 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఇందుకు 447 మంది రైతులకు రూ.59,80,500 విడుదల చేసింది. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగు నదులు ఉప్పొంగి పంటలు దెబ్బతిన్నాయి. పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో పంటలు వరదల పాలయ్యాయి. అలాగే ప్రాణహిత, పెన్‌గంగ పరీవాహక ప్రాంతాలైన సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో పంటలు నీటమునిగాయి. జిల్లాలో మొత్తం 1,374 మంది రైతులకు చెందిన 2,692 ఎకరాల పత్తి పంట వరదలకు దెబ్బతింది. ఎకరానికి రూ.10వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.2,69,22,750 విడుదల చేసింది. నిర్మల్ జిల్లాలో 33 శాతానికి మించి నష్టం జరగకపోవడంతో ఈ జిల్లా రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేయలేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలు

జిల్లా	ఎకరాలు	రైతులు	నగదు
ఆదిలాబాద్	3,096.03	2,041	రూ. 3,09,60,750
కుమురంభీం	2,692.11	1,374	రూ.2,69,22,750
మంచిర్యాల	598.02	447	రూ.59,80,500



సమాజాన్ని జాగృతం చేసింది 'ఆర్ఎస్ఎస్'

- సంఘ ప్రచారక్ దేవేందర్
- జిల్లా కేంద్రంలో పథ్ సంచాలన్ ర్యాలీ
- భారీగా హాజరైన కార్యకర్తలు



సభలో పాల్గొన్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్



పథ్ సంచాలన్‌లో కార్యకర్తలు

ఆదిలాబాద్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమాజాన్ని జాగృతం చేసిందని ఆర్ఎస్ఎస్ సంఘ ప్రచారక్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో విజయదశమి ఉత్సవంలో భాగంగా గురువారం పథ్ సంచాలన్ ర్యాలీ నిర్వహించారు. డైట్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సంఘ ప్రచారక్ దేవేందర్ మాట్లాడారు. అవహేళనలు, అనిచివేతలు ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ నిలిచిందని పేర్కొన్నారు. అనవసరమైన ఆరోపణలు చేస్తూ సంఘంపై నిషేధం విధించేందుకు కుట్రలు చేశారన్నారు. అయినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించక నిషేధాన్ని ఎత్తివేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సంఘం ఎప్పటికీ తప్పు చేయదని తెలిపారు. హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖ విస్తరించాలని, క్షేత్రస్థాయిలో సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యఅతిథి రిటైర్డ్ లెక్చరర్ రంగు ధనరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దేశ సేవకే అంకితమౌతారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆధ్యాత్మిక విలువలను సమాజంలో పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ ఛాలక్ నిమ్మల ప్రతాప్, నగర సంఘసంచాలకులు నూతుల కళ్యాణ్, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

నిన్న మొన్నటివరకు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనాలు గురువారం కురిసిన వర్షంతో ఊరట చెందారు. దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. ఉదయం ఎండ దంచికొట్టగా, మధ్యాహ్నం కురిసిన వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





క్లుప్తంగా

చైన్ స్నాచర్ అరెస్ట్



అరెస్ట్ చేసిన దొంగతో ఎస్సై, సిబ్బంది

జన్నారం: మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కెళ్లిన దొంగను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రాజవర్ధన్, రెండో ఎస్సై తానాజీ తెలిపారు. ఈనెల 3న ఉట్నూర్ మండలం దంతెనపల్లికి చెందిన చింతకింది లావణ్య జన్నారం మండలం దేవునిగూడ గ్రామంలోని తన పుట్టింటికి వచ్చింది. రోడ్డుపై బంధువులతో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన దొంగ ఆమె మెడలోని రెండు తులాల పుస్తెల తాడు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు జరిపారు. చైన్ లాక్కెళ్లిన దొంగ జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన బోర్లకుంట రాజేందర్‌గా గుర్తించారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. స్నాచింగ్‌కు ఉపయోగించిన పల్సర్ బైక్, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్సై రాజవర్ధన్, హెడ్ కానిస్టేబుల్ తుకారాం, కానిస్టేబుల్ సురేశ్‌ను ఉన్నత అధికారులు ప్రశంసించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కుభీర్: మండలంలోని రంజని తండాలో ఆడె నరేందర్‌కు చెందిన ఆవు గురువారం సాయంత్రం మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పశువైద్యాధికారి జీవన్, జేఎల్‌ఎం సునీల్ మృతి చెందిన ఎద్దును పరిశీలించారు. తనకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య గోదావరి సమీపంలో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుని ప్యాంటు జేబులో అగ్గిపెట్టెపై 8459515209 ఫోన్ నంబర్ ఉంది. ఒంటిపై లైట్ గ్రీన్ ఫుల్‌షర్టు, బ్లాక్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కూడి చేతిపై రామేరా అని హిందీలో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలకు 832512176, 9701112343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

11 డీజేలపై కేసు నమోదు

లోకేశ్వరం : మండల కేంద్రంలోని సద్దుల బతుకమ్మల ఊరేగింపులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన 11 డీజేలపై గురువారం కేసు నమోదు చేసిట్లు ఎస్సై అశోక్ తెలిపారు. అనుమతిలేకుండా సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పండుగకు వస్తారు.. పరీక్షలు చేస్తారు..

వైద్యం ఈ రోజుల్లో చాలా ఖరీదైంది. నాడి పట్టాలన్నా పైసలు చెల్లించాల్సిందే. పరీక్షలు, మందులు ఇలా అన్నింటికీ డబ్బులే. అందుకే చాలా మంది ప్రైవేటు వైద్యం అంటేనే జంకుతున్నారు. ఇలాంటి తరుణంలో మంచిర్యాల జిల్లాలో ఓ గ్రామానికి చెందిన వైద్యులు పుట్టిన ఊరి ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఏటా దసరా సెలవులకు సొంత ఊరికి వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మందులు ఉచితంగా అందించి సొంత ఊరి ప్రజలపై మమకారం చాటుకుంటున్నారు.

- పోతనపల్లిలో ఒకే కుటుంబంలో 40 మంది వైద్యులు
- ప్రతీ దసరాకు సొంత ఊరికి..
- గ్రామస్తులందరికీ ఉచితంగా వైద్యం, మందులు..



వైద్యుల కుటుంబ సభ్యులు

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం పోతనపల్లి గ్రామంలో ఒకే కుటుంబంలో 40 మంది వైద్యులు ఉన్నారు. వారంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వైద్య వృత్తిని కొనసాగిస్తున్నారు. ఏటా దసరా పండుగ కోసం సొంత ఊరికి వస్తారు. పుట్టి పెరిగిన ఊరుపై మమకారంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందిస్తారు. అనారోగ్య సమస్య తీవ్రంగా ఉంటే.. హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఉచితంగా చికిత్స చేస్తారు.

ఏటా హెల్త్ క్యాంపు..

పోతపల్లి గ్రామానికి చెందిన గుర్రాల చంద్రారెడ్డి –రత్నమ్మ దంపతులకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐదుగురు కుమారులు వైద్యులుగా, ఒకరు ఇంజినీర్‌గా సెటిల్ అయ్యారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

1986లో చంద్రారెడ్డి మరణించారు. తండ్రి జ్ఞాపకార్థం ఆ ఏడాది నుంచి దసరా సెలవులకు గ్రామానికి వస్తున్న వైద్యులు.. గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబం పెరగడంతో చంద్రారెడ్డి మనుమలు, మనుమరాళ్లు కూడా వైద్యులుగా మారారు. ఇలా కుటుంబంలో మొత్తం 40 మంది వైద్య వృత్తిలో ఉన్నారు. ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, డెర్మటాలజీ, డీజీవో, అనస్థీషియా,



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ప్లాస్టిక్ సర్జన్ లాంటి వివిధ రకాల వైద్యం అందిస్తారు. 40 మంది వైద్యులు గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్యం అందించారు. రూ.70 వేల విలువైన మందులు పంపిణీ చేశారు.

సంతోషంగా ఉంది



మా నాన్న జ్ఞాపకార్థ ఏటా దసరా సెలవుల్లో గ్రామానికి వస్తున్నాం. వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం. దసరా పండుగను సొంత గ్రామంలో అందరితో కలిపి జరుపుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలో 40 మంది వైద్య వృత్తిలో ఉన్నాం.

– డాక్టర్ రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్థోపెడిక్స్, ఉస్మానియా మెడికల్ కాలేజీ

పుట్టి పెరిగిన గ్రామంపై మమకారంతో..



పుట్టి పెరిగిన గ్రామం కావడంతో ఏటా దసరా సెలవుల్లో ఇక్కడకు వస్తాం. వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేస్తాం. గ్రామానికి రావడంతో చాల సంతోషంగా ఉంటుంది. చిన్ననాటి స్నేహితులు గ్రామస్తులు అందరూ కలుస్తుంటారు. హైదరాబాద్ వచ్చిన గ్రామస్తులకు ఉచితంగా వైద్యం అందిస్తాం.

– శరత్‌చంద్రారెడ్డి, ప్లాస్టిక్ సర్జన్, కిమ్స్ ఆస్పత్రి, హైదరాబాద్



'ధన'లక్ష్మి నమోస్తుతే..



బెల్లంపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బెల్లంపల్లిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి గురువారం ధనలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. జగజ్జననీ దుర్గాదేవిని రూ.60 లక్షల కరెన్సీతో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం నాయకులు అలంకరించారు. ఈసందర్భంగా హోమం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

బాసరలో విజయదశమి పూజా కార్యక్రమాలు



బాసర అమ్మవారు

బాసర(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని ఈ నెల 11, 12 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు యాగక్రతువు ప్రారంభం, శనివారం తెల్ల వారుజామున 2 గంటలకు చండీయాగం, వేకువ జామున పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అమ్మవార్లకు మహా అభిషేకం అలంకరణ, హారతి భక్తులకు దర్శనం, అక్షరాభ్యాసాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి రథోత్సవం ప్రారంభం, సాయంత్రం షమీపూజ, ఆశీర్వచనంతో ఉత్సవం సమాప్తి కానున్నట్లు తెలిపారు. వైదిక సిబ్బంది సకాలంలో హాజరై కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పండ్లు పులిహోర పంపిణీ

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదవరోజు గురువారం అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. బాసరలోని వాసవి రెస్టారెంట్, వ్యాసపురి కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ ఇన్‌చార్జి సంతోష్, గణేశ్ గాదేవార్ భక్తులకు పులిహోర, శిర, అరటి పండ్లు పంపిణీ చేశారు.

గనులపై విందు భోజనాలు



ఓసీపీలో విందు భోజనాల దృశ్యం

శ్రీరాంపూర్: లాభాల వాటా ప్రకటన సందర్భంగా డెప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గనులపై కార్మికులతో సమవేశం నిర్వహించాలని, సంస్థ స్థితిగతులపై వాస్తవ పరిస్థితులను వివరించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈమేరకు శ్రీరాంపూర్ డివిజన్‌లోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనితోపాటు ఆర్కే 5, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ 1, ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం విందు భోజనం, సమావేశం నిర్వహించారు. ఉజ్వల సింగరేణి– ఉద్యోగుల పాత్ర పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉద్యోగులకు భోజనాలు పెట్టిన తరువాత కంపెనీ స్థితిగతులను వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

శ్రీరాంపూర్‌తోనే సింగరేణికి భవిష్యత్తు..

శ్రీరాంపూర్ ఓసీపీపై నిర్వహించిన కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హాజరై మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాతోనే సింగరేణి భవిష్యత్తు ఉందని తెలిపారు. శ్రీరాంపూర్‌కు సింగరేణికి తలలాంటిదన్నారు. ఇక్కడే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారని, బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 10 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఒడిశా నైనీ బ్లాక్, తాడిచెర్ల బ్లాక్‌లకు క్లీయరెన్సు వచ్చాయన్నారు. మంచిర్యాల జిల్లాలో కొత్తగా తాడిచెర్ల, కేకే 2 ఇతర ఓసీపీలను ప్రైవేటుకు ఇవ్వమని తెలిపారు. పాత సీఎండీ నర్సింగ్‌రావుతో కలిసి నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డితో చర్చించి జైపూర్‌లో ఎస్టీపీపీ ఏర్పాటు చేయడానికి కృషి చేశానన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వరంగ పరిశ్రమల్లో లేని విధంగా లాభాల్లో కార్మికులు వాటా ఇస్తున్న సంస్థ సింగరేణి మాత్రమే అన్నారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాలిసిన బకాయిలను విడుతలవారీగా ఇప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. అనంతరం స్టేజీపైనే ఏర్పాటు చేసి భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పైన సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ఆర్థిక ముఖ చిత్రం, ముందున్న సవాళ్లు, మార్కెట్ పోటీ వంటి వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా అధికారులు ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, ఏజెంట్లు ఏవీ.రెడ్డి, గోపాల్‌సింగ్, డీజీఎం చిరంజీవులు, ఓసీపీ పీవో టీ.శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీ, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కె బాజీసైదా, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతిరాజు, ఏరియా క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని సంక్షేమ అధికారి బొంగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మందమర్రి ఏరియాలో..

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగులకు ఆయా గనులు, డిపార్ట మెంట్‌లపై సింగరేణి యాజమాన్యం శుక్రవారం విందు ఏర్పాటు చేసిందని జీఎం దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు సింగరేణి సంస్థ స్థితిగతులు, వాస్తవ పరిస్థితులపై దృశ్యరూపంలో ఉద్యోగులకు వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాసిపేట, కాసిపేట–2, కేకే–5, ఆర్కే ఓసీపీ, కేకే–ఓసీపీ గనుల్లో ఉదయం 7–8 గంటల వరకు, మధ్యాహ్నం 3–4 గంటల వరకు దృశ్యరూపంలో అవగాహన మధ్యాహ్నం 1–3 గంటల వరకు విందు ఉంటుందని వివరించారు. జీఎం ఆఫీస్, ఏరియా వర్క్‌షాపు, ఆర్కేపీ సీహెచ్‌పీ ఏరియా హాస్పిటల్‌లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు దృశ్యరూపంలో అవగాహన, 1 నుంచి 3 గంటల వరకు విందు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఓర్వలేకనే ప్రతిపక్షాల గగ్గోలు

- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు



సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ ఆవరణలో ఇంటి గ్రేటెడ్ మార్కెట్ భవనం కూల్చివేత పనులను గురువారం పరిశీలించారు. ప్రజలకు అక్కరకు రాని మార్కెట్ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నామన్నారు. నవంబర్‌లో ఆస్పత్రి నిర్మాణ పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌కు ఉన్నత వైద్యం కోసం వెళ్లకుండా మంచిర్యాలలోనే అందించేలా కృషి చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు కంటగింపుగా మారిందన్నారు. కూరగాయల మార్కెట్‌లో కొత్త భవన నిర్మాణాన్ని ఎందుకు చేపట్టలేదో దివాకర్‌రావు ప్రజలకు చెప్పాలన్నారు. గోదావరిపై అంతర్గాం బ్రిడ్జి నిర్మాణం మాజీ ఎమ్మెల్యే స్వార్థంతో చేపట్టిందే తప్ప ప్రణాళిక లేదని ఆరోపించారు.

సమాజాన్ని జాగృతం చేయడమే ఏఐబీఎస్ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న జాదవ్ రెడ్డినాయక్

నార్నూర్: బంజారా సమాజాన్ని జాగృతం చేయడమే ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం లక్ష్యమని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బంజారా గిరిజనుల సమస్యలపై ఏఐబీఎస్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, హక్కుల పరిరక్షణ కోసం సంఘం పని చేస్తోందని తెలిపారు. బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయం కోసం ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాథోడ్ గణేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు, పాక్స్ చైర్మన్ అడే సురేశ్, రాథోడ్ ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడి మృతి తట్టుకోలేక అత్త హఠాన్మరణం

- రెండు రోజుల వ్యవధిలోనే మృతి



వచ్చలబాయి(ఫైల్)

తాంసి: అల్లుడి మృతిని తట్టుకోలేక అత్త హఠాన్మరణం చెందిన ఘటన భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండల కేంద్రానికి చెందిన రాజుల్‌వార్ వచ్చలబాయి (70) భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు. అప్పటి నుంచి కరంజి(టి) గ్రామంలోని అల్లుడు కర్నేవార్ గణేశ్, ఏకైక కూతురు కవిత ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 4న రోడ్డు ప్రమాదంలో గణేశ్‌తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 8న మృతి చెందాడు. ఈ క్రమంలో కూతురు, మనవడి జీవితం ఏమవుతుందోనని వచ్చలబాయి బెంగ పెట్టుకుంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఆకస్మికంగా మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

బెజ్జూర్: మతిస్థిమితం లేని ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం సోమిని గ్రామ పంచాయతీ పరిధిలోని నందరాంగూడకు చెందిన గావిడె అమృత(19) అనే వివాహిత కొన్నినెలలుగా మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి ఆటోలో బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. తహసీల్దార్ భూమేశ్వర్ బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి వివరాలు సేకరించారు.

ఉరేసుకొని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన సుల్తాన బేగం (47) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుల్తాన బేగం, ఆమె భర్త వేర్వేరుగా కేఆర్‌కే కాలనీలో నివాసం ఉంటున్నారు. గత కొన్ని నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తితో మందమర్రిలో యువకుడు..

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన ఊదురుకోట నవీన్(33) జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... డీగ్రీ వరకు చదువుకున్న నవీన్ కారు డ్రైవర్‌గా కొంత కాలం పనిచేశాడు. గతంలో మార్కెట్ ఏరియాలో బిజినెస్ పెట్టి రాణించలేక పోయాడు. తలిదండ్రులు వృద్ధులు కావడం, ప్రస్తుతం ఎలాంటి జీవనోపాధి లేకపోవడంతో జీవితంపై విరక్తితో ఇంటి ఆవరణలోని వెనుక గదిలో ఉరేసుకున్నాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోథ్‌లో వ్యక్తి..

బోథ్: మండల కేంద్రానికి చెందిన తలారి భూమన్న(52) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. తలారి భూమన్నకు ఇద్దరు కుమారులు. కాగా వారిద్దరు వేరుగా ఉంటున్నారు. గత నాలుగేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ, కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య మృతిచెందిన నాటి నుంచి భూమన్న తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. పక్క ఇంట్లో ఉన్న వారికి దుర్వాసన రావడంతో సంబంధిత ఇంటి ఓనరుకు, కుమారులకు సమాచారం అందించారు. తలుపులు తెరిచిచూడగా భూమన్న ఉరివేసుకుని మృతిచెంది కనిపించాడు. కుమారుడు తలారి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమకారుల ఫోరం 'ఉమ్మడి' చైర్మన్‌గా శేఖర్



కొట్టి శేఖర్

నిర్మల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా నిర్మల్‌కు చెందిన కొట్టి శేఖర్‌ను కొనసాగిస్తున్నట్లు ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై కొట్టి శేఖర్ హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యమకారుల ఐక్యత, హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేస్తానన్నారు.

చనిపోతున్నానని లేఖ రాసి వ్యక్తి అదృశ్యం



సుదర్శన్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన శాబంతుల సుదర్శన్(32) అదృశ్యమైనట్లు ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. స్థానికంగా ఆర్టీసీ హైర్‌బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సుదర్శన్ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అంతేకాకుండా తాను చనిపోతున్నానని, తనచావుకు ఎవరూ కారణం కాదంటూ లేఖ రాసి ఇంట్లో వదిలి వెళ్లాడు. దీంతో ఆందోళన చెందిన అతని భార్య అశ్విని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



ఘటనాస్థలిలో గాయపడిన వ్యక్తి..

ముధోల్: మండలంలోని ముధోల్, తరోడా గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని ఉమ్రి తా లూక వన్గావ్ గ్రామానికి చెందిన గంగాధర్, మాధవ్‌రావు గురువారం భైంసా మండలం దేగాంలో బంధువుల అంత్యక్రియల కోసం వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ముధోల్, తరోడా గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న గంగాధర్‌కు తీవ్రంగా మాధవ్‌రావుకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, పక్కన ఎస్సైలు

తాండూర్: గంజాయిని అక్రమంగా రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మాదారం పోలీసు స్టేషన్‌లో సీఐ కుమారస్వామి గురువారం నిందితుల వివరాలు వెల్లడించారు. ఈస్‌గామ్ గ్రామానికి చెందిన కొంత మంది తాండూర్ మండలం మాదారం శివారు ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నట్లు మాదారం ఎస్సై సౌజన్యకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో మాటువేసి గంజాయిని అక్రమంగా రవాణా చేసి, కొనుగోలు చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.27,500 విలువైన 1,100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు జప్తుచేశారు. షేక్ హసమ్(తాండూర్), గొర్లపల్లి సందీప్‌కుమార్(తంగళ్లపల్లి), బండారి శ్యామ్(తాండూర్), విజయ్ హల్దార్(ఈస్‌గామ్), రాజ్‌కుమార్‌సర్కార్(ఈస్‌గామ్)ను అరెస్టు చేసినట్లు సీఐ ప్రకటించారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాదారం, తాండూర్ ఎస్సైలు సౌజన్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జడ్
ఓఎస్: విండోస్ 11 హోమ్



శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్

డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మోమరీ: 12జీబి ర్యామ్/256జీబి/512 జీబి స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ అల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్‌ఎవిట్
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్‌డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.

ఇన్‌స్పిరేషన్



రుక్మిణి వారియర్

**ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా?
'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా?
ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్.
ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...**

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిల్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్శిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది.

స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది.

'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగంలోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైఓవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ పరియా



మెటా వారి మూవీ జెన్

'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఓపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది.

మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

● గేమింగ్



ఆయుధాల దండోర

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అగ్రిమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోత్రాన్‌ను ఎదుర్కోవడం.

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

ధీ ధీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'ధీ ధీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఓషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఏతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...



● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.



● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

పవర్‌ఫుల్ ఝాన్సీ



● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురు ప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో



● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ



● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ– ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ – అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా



● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్‌ఎన్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ– ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్‌ఎన్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్లు, మనసు, ఎల్‌ఎస్‌ఎల్‌ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్లు'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్



● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికే హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్లడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదాపు రోడ్డు మార్గానే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయీ రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ